క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న మంత్రి

చివ్వెంల : యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన యువకులకు శుక్రవారం సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. క్రికెట్, క్యారం, షటిల్, బాస్కెట్ బాల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

పెన్‌పహాడ్ : ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ మండల కమిటీని మండల కేంద్రంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చట్టు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా చూడి సందీప్‌రెడ్డి, బండి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జూలకంటి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా షేక్ జానీ, సంయుక్త కార్యదర్శులుగా నందిపాటి పేరమయ్య, బిట్టు హరీష్, కోశాధికారిగా పత్తిపాక నాగరాజులను ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

నూతనకల్ : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన సంఘటన యడవెల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏనిగతల మల్లయ్య తన గేదెను మేత కోసం వదిలిపెట్టాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లకు తగిలి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ. 50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

మద్దిరాల : విద్యుదాఘాతంతో గేదే మృతి చెందిన సంఘటన కుక్కడంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన బర్పటి సోమయ్య తన వ్యవసాయ పొలంలో గేదెలను మేత కోసం వదిలిపెట్టాడు. అయితే ఇటీవల ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపోవడంతో వాటికి మరమ్మతులు చేపట్టకుండా తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కానీ శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేయడంతో ఆ తీగలకు విద్యుత్ సరఫరా అయ్యింది. ఈ క్రమంలో అక్కడే మేత మేస్తున్న గేదె విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె మృతి చెందింది. బాధిత రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

చివ్వెంల : బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం బి.చందుపట్ల గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట కన్వీనర్ కర్నాటి కిషన్, తుక్కాని మన్మథరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జంపాల వెంకటేశ్వర్లు, దొంగరి అంజయ్య, మాధవరపు అనిల్‌రావు, పఠాన్ పాష, కాసుల ఏకస్వామి, తండు సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగవు

అర్వపల్లి : ఎమ్మెల్యే కిశోర్‌పై అసత్య ఆరోపణలు చేయడం తగదని మాజీ ఎంపీపీ, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ పందిరి ఎర్రనర్సయ్య అన్నారు. శుక్రవారం పర్సాయపల్లిలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కూడా కిశోర్ గెలుపు ఖాయమని తేలిపోవడంతో ప్రతిపక్షాలు ఆయనను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల నాయకుడు పి.యుగంధర్, కేసారపు వెంకన్న, సుధాకర్, లింగస్వామి, యల్లయ్య, వీరస్వామి, సందీప్, వెంకన్న, శ్రీకాంత్, గోపి పాల్గొన్నారు.

పాలీసెట్ ఫలితాల్లో ప్రతిభ



కె.శశివదన్



కె.ఉజ్వాన్

సూర్యాపేటటౌన్ : పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2023 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలకు చెందిన కె.శశివదన్ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, కె.ఉజ్వాన్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఎల్.భవన స్టేట్ 29వ ర్యాంకుతో పాటు 100లోపు 10 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు.

అరకొర వసతుల్లో పశువైద్యశాల

- రెండేళ్లుగా నిలిచిపోయిన కరెంట్ సరఫరా
- వర్షం వస్తే జలమయంగా మారుతున్న ఆస్పత్రి గదులు
- సరైన సేవలు అందక రైతుల పాట్లు



ఆస్పత్రిలో కరెంట్ లేక నిరుపయోగంగా ఉన్న ఫ్రిడ్జి



ఆస్పత్రిలో పనిచేయని చేతిపంపు

అర్వపల్లి : అర్వపల్లిలోని మండల ప్రాథమిక పశువైద్యశాల కనీస వసతులకు నోచుకోవడంలేదు. మండల పశువైద్యశాల 50 ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో పూర్తిగా శిథిలమైంది. అయినా తప్పని పరిస్థితిలో ఈ భవనంలోనే ఆస్పత్రి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రికి రెండేళ్లుగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వర్షం వస్తే ఈ భవనం నీటిలో మునిగిపోయి పూర్తిగా దెబ్బతింటుంది. ఓ పక్క ఎండలు మండిపోతుండటం.. మరోవైపు భవనంలో కరెంట్‌లేక ఫ్యాన్లు పనిచేయకపోవడంతో డాక్టర్‌తో పాటు సిబ్బంది, రైతులు ఒక్కనిమిషం కూడా ఆస్పత్రిలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆసుపత్రి ఆవరణలోని చేతిపంపు పనిచేయడంలేదు. పశువులకు వైద్యం అందించే పశువుల బోను కూడా విరిగిపోయింది. ముఖ్యంగా ఆస్పత్రిలోకి రావడానికి సరైన దారిలేదు. ఆస్పత్రికి ప్రతి మూడు నెలలకోసారి మందుల స్టాకు వస్తుంది. కానీ కరెంట్ సరఫరా లేకపోవడంతో ఫ్రిడ్జి పనిచేయక చాలా వ్యాక్సిన్లు పాడవుతున్నాయి. గత్యంతరం లేక డాక్టర్ తన ఇంట్లోని ఫ్రిడ్జిలో వ్యాక్సిన్ నిలువచేస్తున్నారు. వర్షానికి బిల్డింగ్ మొత్తం తడుస్తుండటంతో మందులు ఎక్కడ పెట్టాలో తెలియక డాక్టర్, సిబ్బంది ఇబ్బందుల పాలవుతున్నారు. ఇటీవల వర్షాలకు ఆస్పత్రిలోని కంప్యూటర్, ఫర్నీచర్, మందులు తడిసిపోయాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రైతులు కూడా ఇబ్బందుల పడుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రికి కరెంట్ సరఫరాను పునరుద్ధరించాలని, భవనానికి మరమ్మతులు చేయించాలని, వైద్యసేవలకు అంతరాయం లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మందులు పాడవుతున్నాయి



అర్వపల్లిలోని పశువైద్యశాలలో రెండేళ్లుగా కరెంట్ సరఫరా లేదు. దీంతో ఫ్రిడ్జి పనిచేయక వ్యాక్సిన్, ఇతర మందులు పాడవుతున్నాయి. అలాగే పశువుల బోనుకూడా విరిగిపోయింది. నీటి వసతి కూడా లేదు. చిన్న పాటి వర్షం వచ్చినా ఆస్పత్రి భవనంలోకి వర్షపు నీళ్లు చేరి పూర్తిగా జలమయమవుతుంది.

– నీలం సత్యనారాయణ, రైతు, అర్వపల్లి

పైఅధికారులకు తెలియజేశాం



ఇక్కడి ఆస్పత్రి 50 ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో పూర్తిగా శిథిలమైపోయింది. ఆస్పత్రి మొత్తం వర్షానికి చెరువును తలపించేలా మారుతుంది. వర్షాలకు ఫ్రిడ్జి, కంప్యూటర్ నీటిలో మునిగిపోయి పనిచేయటం లేదు. బిల్లు పెండింగ్‌లో ఉండటంతో రెండేళ్లుగా ఆస్పత్రికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కొత్తభవనం నిర్మించి, అన్ని వసతులు కల్పించాలని అధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

– డాక్టర్ బి. అర్జున్, మండల పశువైద్యాధికారి

శ్రీసాయి దత్త మందిరం వార్షికోత్సవం



దత్తసాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి : పట్టణంలోని జమ్మిగడ్డలో ఉన్న శ్రీసాయి దత్త మందిరం నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను గోపూజతో ప్రారంభించారు. లక్ష్మీగణపతి హోమం, సుబ్రహ్మణ్య స్వామి హోమం, ఏకాదశ రుద్ర హోమం, చండీ హోమాలను అర్చకులు శ్రీనాథ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కి చెందిన వేద పండితుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి దత్త మందిరం వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు యార్లగడ్డ రవీంద్రబాబువిజయలక్ష్మి, తోట గణేష్, నరేందర్, సునీత, అర్చకులు రమణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథం ఇవ్వాలని వినతి



తిరుమలగిరి : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు



పెన్‌పహాడ్‌లో..

తిరుమలగిరి : భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, కె.యాకన్న, శ్రీనివాస్, ఐ.విజయ్, పి.వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలి

పెన్‌పహాడ్ : రాజ్యాంగ గ్రంథాన్ని దేశంలోని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ డీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శేషగిరిరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మహారాజ్ మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఇచ్చిన పిలుపుమేరకు వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను ప్రజలందరికీ తెలియజేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మండల అధ్యక్షుడు సైదులు మహారాజ్, మండల కమిటీ సభ్యులు బాల నరసింహ, అరవిందు, వెంకట్, లోకేష్, మనీ, సంతోష్, పాష తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి మీదుగా హైదరాబాద్‌కు మరో బస్సు

అర్వపల్లి : హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో హైదరాబాద్-2 డిపో నుంచి ప్రతిరోజు సాయంత్రం 5–30 గంటలకు అర్వపల్లి మీదుగా తుంగతుర్తి మండలం తూర్పుగూడేనికి ఆర్టీసీ బస్సును నడుపనున్నారు. ఈ బస్సు డిపో నుంచి సాయంత్రం 5–30 గంటలకు బయలదేరి చౌటుప్పల్, నకిరేకల్ మీదుగా మూసీనది నుంచి జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి మీదుగా తుంగతుర్తి మండలం తూర్పుగూడేనికి వెళ్లనుంది. రాత్రికి అక్కడే ఉండి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బయలుదేరి ఇదే రూట్లో 8–30 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ చేరుతుందని అక్కడి డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కాగా ఇదే రూట్లో ప్రతి రోజు ఉదయం 5 గంటలకు సూర్యాపేట డిపోకు చెందిన బస్సు తుంగతుర్తి నుంచి అర్వపల్లి మీదుగా దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్తుంది.

28న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మట్టిపెల్లి సైదులు

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 28న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో జరిగే సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యమైందని ఆరోపించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి అవిరే అప్పయ్య, మండల కమిటీ సభ్యులు సానబోయి ఉపేందర్, నూకల గిరి ప్రసాద్ రెడ్డి, యాతాకుల మల్లయ్య, రాచకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

తుంగతుర్తి : సారాకేసులో బైండోవర్‌ను ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన పగిండ్ల యాదయ్య గతంలో సారా తయారు చేస్తూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. మళ్లీ అదే నేరం చేస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చామని తెలిపారు. బైండోవర్ ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా, లేదా 2సంవత్సరాల జైలు శిక్ష విధించగా ఆయన జరిమానా తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ జ్యోతిరాణి

అర్వపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై బీఆర్‌ఎస్ శ్రేణులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేయాలని అర్వపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డు రామలింగయ్యయాదవ్, సర్పంచ్ దబ్బేటి జ్యోతిరాణి కోరారు. శుక్రవారం గ్రామంలో జరిగిన బూత్ కమిటీల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నాయకత్వంలో బీఆర్‌ఎస్‌కు మూడో సారి గెలుపు ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు కసనబోయిన వెంకన్న, ఇన్‌చార్జ్‌లు సీహెచ్ తిరుపతయ్య, ఎల్. లింగరాజు, మెండె సురేష్, ఇటికాల సాయిలు, ఉప్పుల లింగరాజు, డి.ప్రభాకర్, కె.శ్రీను, కూరాకుల శేఖర్, మైబెల్లి, సైదులు, వేముల గణేష్, ఉయ్యాల రాము, మధు, వెంకన్న, శ్రీను, లింగమల్లు, రవి, సైదులు, బాషా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల ముందస్తు అరెస్టు



తుంగతుర్తిలో అరెస్టయిన అఖిలపక్ష నాయకులు



నాగారంలో అరెస్టయిన బీజేపీ నాయకులు

తుంగతుర్తి : అఖిలపక్షాల ఆధ్వర్యంలో తిరుమలగిరిలో చేపట్టిన బంద్ కార్యక్రమానికి వెళ్తున్న అఖిలపక్ష నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. నియోజకవర్గంలో రోజు రోజుకూ ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు పెరిగిపోతున్నాయని అన్నారు. అధికార పార్టీకి పోలీసులు తొత్తుగా వ్యవహరిస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అరెస్టయిన వారిలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పాల్వాయి పరశురాం, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా, టీఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ, బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, బీఎస్పీ మండల అధ్యక్షుడు నవీన్, అఖిల పక్ష నాయకులు నవీన్, పాలబ్బాయి సూరయ్య, బుర్ర శ్రీనివాస్, సిద్దయ్య, వెంకన్న, సునీల్, నరేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

నాగారం : అఖిలపక్షాల పిలుపు మేరకు తిరుమలగిరిలో చేపట్టిన బంద్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి నాగారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడారు. శాంతియుతంగా చేపట్టిన బంద్‌లో పోలీసులు అఖిలపక్ష నాయకులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తుగా మారారని విమర్శించారు. దళితులను దూషించిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎల్సోజు దీన్‌దయాల్, చిరబోయిన హన్మంతు, మూల వెంకన్న, ధరావత్ సంతోష్, తీపిరెడ్డి సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

అరాచకాలను ప్రశ్నిస్తూనే ఉంటాం



మాట్లాడుతున్న ఏపూరి సోమన్న

తుంగతుర్తి : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నియోజకవర్గంలో చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటామని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముందస్తుగా అరెస్టయిన ఎమ్మార్పీఎస్ నాయకులను పరామర్శించి మాట్లాడారు. దళితబంధు పథకంలో జరిగిన అవినీతిని ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అఖిలపక్ష నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలతో పాటు అడ్వకేట్ యుగేంధర్‌పై దాడిని నిరసిస్తూ తిరుమలగిరిలో చేపట్టిన బంద్‌కు ప్రజలు, వర్తక సంఘాల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. దళితబంధులో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు దళితులను ఎమ్మెల్యే దూషించారని అన్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ ప్రశ్నించేవారిని అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు వైఎస్సార్ టీపీ నాయకులు చింతకుంట్ల పరమేష్, మందుల రామ్, ఏపూరి యాకన్న, దున్నపోతుల చంద్రశేఖర్, ఋషి, దిలీప్, మహేష్, ప్రేమ్ ఉన్నారు.

ముగిసిన ‘కంటి వెలుగు’

అర్వపల్లి : అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం పూర్తయింది. ఈ పీహెచ్‌సీ పరిధిలో 15 గ్రామ పంచాయతీలుండగా అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. పర్సాయపల్లి, బొల్లంపల్లి గ్రామాలు నాగారం పీహెచ్‌సీ పరిధిలో ఉండగా పర్సాయపల్లిలో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి చేశారు. ప్రస్తుతం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో మాత్రమే కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది

చిన్నారులకు వైద్యపరీక్షలు



అర్వపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అర్వపల్లి : అర్వపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులలో పోషకాహారలోపం, రక్తహీనత, ఎదుగుదలలో లోపాలు, పుట్టుకతో వచ్చే లోపాలు తదితర విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అవసరమైన పిల్లలకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కె.గౌతం, కె.స్పందన, ఫార్మసిస్ట్ సతీష్, ఏఎన్‌ఎం గీత, అంగన్‌వాడీ టీచర్ నవనీత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి

పెన్‌పహాడ్ : వానా కాలం 2023 సీజన్ పంటలకు సంబంధించి మండలంలోని రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మండల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ వారు అన్ని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తారని తెలిపారు. రిటైల్ డీలర్లు పీఓఎస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, ఏఈఓ సంధ్య, ఫర్టిలైజర్స్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని జామాయిల్ చెట్లు దగ్ధం



దగ్ధమవుతున్న జామాయిల్ చెట్లు

చివ్వెంల : నిప్పంటుకుని జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రం శివారు సూర్యాపేట–ఖమ్మం రహదారి పక్కన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం పట్టణానికి చెందిన నాగేశ్వర్‌రావు 3 ఎకరాల భూమిలో నాటిన జామాయిల్ చెట్లలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు లేచాయి. దీంతో రహదారిపై వెళ్తున్న వాహనదారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ప్రమాదంలో సుమారు 1500 చెట్లు కాలిపోయాయి.

కొనసాగుతున్న పారిశుద్ధ్య వారోత్సవాలు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 1, 2 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించారు. పారిశుద్ధ్య పనులను కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భాస్కర్, హన్మంతు, వార్డు ఆఫీసర్ శోభ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ అవకతవకలపై ఆందోళన

- అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపణ
- దారికి అడ్డంగా ముళ్లకంచె వేసి, ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం
- డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ఉద్రిక్తం



విభళాపురంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్నా చేస్తున్న పేదలు, సీపీఎం నాయకులు

మోతె : మండలంలోని విభళాపురం గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై అనర్హులకు మంజూరు చేయించారని ఆరోపిస్తూ శుక్రవారం డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఇళ్ల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పేదలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. పేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల ముందు దారికి అడ్డంగా ముళ్ల కంచె వేసి ధర్నా చేశారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఇళ్ల ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే రావాలని నినాదాలు చేశారు. కాగా రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులు గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఆర్డీఓ, కలెక్టర్‌లకు లబ్ధిదారుల జాబితా పంపించారు. కలెక్టర్ పరిశీలన అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక చేశారు. అయితే స్థానిక ఎంపికైన కొందరు లబ్ధిదారులను జాబితా నుంచి తొలగించి వారి స్థానంలో బీఆర్‌ఎస్ పార్టీ అనుచరులను జాబితాలో చేర్చారని పేదలు ఆరోపిస్తున్నారు. ఇళ్ల ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న పేదలు, సీపీఎం నాయకులపై దాడి చేసిన మోతె ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మట్టిపెల్లి సైదులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొదటి లిస్టులో ఉన్న అర్హుల పేర్లు తొలగించి రెండవ లిస్టు తయారు చేసి అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. అర్హులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. పోలీసుల బెదిరింపులకు భయపడేదే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు వెలుగు చేగువేరా, మణెమ్మ, రావుల సావిత్రి, వేముల నర్సమ్మ, మైనంపాటి వీరారెడ్డి, నవీన్‌రెడ్డి, రాధ, పవన్, శ్రీనివాస్, యల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళలు

ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సానబోయిన నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి రూ. 4వేలు, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి 50కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొగుళ్ల వెంకన్న, ఎండీ ఫజురుల్లా, శంకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ

తుంగతుర్తి : నల్లగొండలో ఈ నెల 30న జరిగే మాజీ ప్రజాప్రతినిధుల 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ, మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. శుక్రవారం తుంగతుర్తి మండల పరిధిలోని బండరామారం గ్రామంలో రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గట్టు వెంకటనారాయణ, గడ్డం ఉప్పలయ్య, ఆకారపు సైదులు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీపై చర్యలు తీసుకోవాలి

కోదాడరూరల్ : అనర్హులకు ఇళ్లు కేటాయించిన అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి డిమాండ్ చేశారు. మోతె మండలంలోని అప్పన్నగూడెంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధితులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అప్పన్నగూడేనికి చెందిన సర్పంచ్, ఎంపీటీసీలు ఈ నెల 24న రూ.10 వేల చొప్పున తీసుకొని అనర్హులకు ఇళ్లు ఇచ్చారని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే దాడులు చేయడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపినా పట్టించుకోకుండా ఉండడం శోచనీయమన్నారు.